క్లుప్తంగా

ఆన్‌లైన్‌లో వివరాల నమోదు



ఆన్‌లైన్‌లో రేషన్‌కార్డుల వివరాలు నమోదు చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

శివ్వంపేట(నర్సాపూర్): కొత్తగా మంజూరైన రేషన్‌కార్డు లబ్ధిదారులకు వచ్చే నెల నుంచి రేషన్ దుకాణాల ద్వారా సరుకులు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రభుత్వం నుంచి శనివారం ఆన్‌లైన్ ఫార్మేట్ ఇవ్వడంతో రెవెన్యూ సిబ్బంది మండల వ్యాప్తంగా మంజూరైన రేషన్‌కార్డు లబ్ధిదారులకు సివిల్ సప్లయ్ ద్వారా సరుకులు ఇచ్చేందుకు సంబంధించి వివరాలు నమోదు చేశారు. మండలంలో కొత్తగా 1154 రేషన్‌కార్డులతో పాటు 658 కొత్త సభ్యులతో కార్డులు మంజూరైనట్లు ఎంపీడీఓ నాగేశ్వర్‌గుప్తా, ఉప తహసీల్దార్ షఫీయొద్దీన్ తెలిపారు.

అపార్ ఐడీ పూర్తి చేయండి



మాట్లాడుతున్న ఎంఈఓ బాలరాజు

కౌడిపల్లి(నర్సాపూర్): ఒక దేశం, ఒక విద్యార్థి కార్డు పేరుతో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఏపీఏఆర్(అపార్) (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రి) ఐడీకార్డులు సకాలంలో పూర్తి చేయాలని ఎంఈఓ బాలరాజు తెలిపారు. శనివారం కౌడిపల్లి ఉన్నత పాఠశాలలో మండలంలోని వివిధ పాఠశాలల హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల అపార్ ఐడీ త్వరగా పూర్తి చేయాలన్నారు. మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలన్నారు. మిడ్‌లైన్ టెస్ట్ ఎంట్రీ, బేస్‌లైన్ టెస్ట్ అప్‌డేట్ త్వరగా చేయాలన్నారు. డైస్ సమాచారం సకాలంలో ఇవ్వాలన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని తెలిపారు. విద్యార్థులకు తరగతి గదిలో విద్యతో పాటు సామాజిక అంశాలను తెలియచేయాలని చెప్పారు. వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



మదూర్‌లో ఎస్‌పీఎల్ క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రాజు

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని మదూర్‌లో ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రాజు, మాజీ సర్పంచ్ కుమార్‌గౌడ్ ప్రారంభించారు. శనివారం మదూర్ గ్రామశివారులో ఎస్‌పీఎల్ పేరిట నిర్వహిస్తున్న లిగ్ క్రికెట్ పోటీల్లో 8 జట్ల మధ్య 30 మ్యాచ్‌లు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు నగదు బహుమతితో పాటు మోమెంటో అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు మంచిగా చదువుకోవాలి

రామాయంపేట సీఐ వెంకట్ రాజాగౌడ్



పరీక్షల ప్యాడ్లు అందుకున్న విద్యార్థులు

రామాయంపేట(మెదక్): పరీక్షలు సమీపిస్తున్న దృష్ట్యా విద్యార్థులు సక్రమంగా చదువుకోవాలని సీఐ వెంకట్ రాజాగౌడ్ సూచించారు. హైదరాబాద్ నివసిస్తున్న మౌనిక అజయ్ కూతురు ఆధ్యా జన్మదినం సందర్భంగా సానీక్ష ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పరీక్షల ప్యాడ్లు, పెన్నులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య లభిస్తుందని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈనెల రోజులపాటు కష్టపడి చదివితే, మిగతా రోజులు ఎంజాయ్ చేయవచ్చన్నారు. కార్యక్రమంలో సానీక్ష ఫౌండేషన్ అధ్యక్షుడు శివ, కోఆర్డినేటర్ స్వరూప, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మల్లేశం, అధ్యాపకులు పాల్గొన్నారు.

మినీ స్టేడియం.. ప్రతిపాదనలకే పరిమితం

- క్రీడలకు దూరం అవుతున్న యువత
- గ్రామాల్లో అలంకారప్రాయంగా మైదానాల బోర్డులు

తూప్రాన్: గ్రామీణ ప్రాంతాల క్రీడాకారుల్లో ప్రతిభ ఉన్నా సాధన చేసేందుకు అనువైన మైదానాలు, సరైన సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అన్ని సౌకర్యాలతో మినీ స్టేడియం ఏర్పాటు చేయాలని క్రీడాకారులు కోరుతున్నారు. స్టేడియం మంజూరై ఏళ్లు గడుస్తున్నా ముందడుగు పడటంలేదు. జిల్లాలో చాలా చోట్ల స్థలం లేక క్రీడా మైదానాలు ఏర్పాటు చేయలేదు. ఇక్కడ స్థలం ఉన్నా.. పనులకు మోక్షం కలగడంలేదు. క్రీడాకారులు వివిధ ఉద్యోగాలకు పోటీ పడుతుంటే.. నిరుద్యోగ యువత అసౌకర్యాల మధ్య సాధన చేయాల్సిన పరిస్థితి నెలకొంది.



తూప్రాన్‌లో మినీ స్టేడియంకు కేటాయించిన స్థలం

పోటీలకు ఇబ్బందులు

మండలంలో మొత్తం 14 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. మున్సిపాలిటీ తూప్రాన్ ప్రధాన కేంద్రంతో పాటు నాలుగు విలీన గ్రామాలు ఉన్నాయి. క్రీడాకారులతో పాటు పోలీసు, తదితర పోటీ పరీక్షలకు కోసం నిరుద్యోగ యువత సాధన చేసేందుకు సమస్యగా మారింది. మండల స్థాయి క్రీడాపోటీలు నిర్వహించే సమయంలో సరైన మైదానం లేక ప్రైవేట్ పాఠశాలల మైదానంలో అసౌకర్యాల నడుమ పోటీలు నిర్వహిస్తున్నారు. పలు సందర్భాల్లో పోటీలు నిర్వహించాల్సి వస్తే ఖాళీగా ఉన్న ప్రైవేట్ స్థలాల వైపు చూడాల్సిన దుస్థితి. మున్సిపల్ కేంద్రంలో మినీ స్టేడియం నిర్మాణం ఏర్పాటు చేయాలని ఏళ్లుగా యువత ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా కార్యరూపం దాల్చడం లేదు. త్వరగా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

నిధుల కొరతతో నిలిచిన పనులు

నాలుగేళ్ల క్రితం మాజీ సీఎం కేసీఆర్ తూప్రాన్ మున్సిపల్ కేంద్రంలో మినీ స్టేడియం ఏర్పాటుకు హామీ ఇచ్చారు. అప్పట్లో బీఆర్‌ఎస్ నాయకులు గడా ప్రత్యేక నిధులతో మినీ స్టేడియానికి రెవెన్యూ అధికారులతో కలిసి స్థలాన్ని సేకరించారు. పట్టణంలోని డబుల్ బెడ్రూం పక్కన ప్రభుత్వ స్థలం సుమారు ఐదు ఎకరాలను గుర్తించారు. అక్కడ మినీ స్టేడియం ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కానీ అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించకపోవడంతో మినీ స్టేడియం ప్రతిపాదనలకే పరిమితమైంది.

ప్రైవేట్ వెంచర్లో గంటకు రూ.600..

పట్టణ సమీపంలోని వెంచర్లలో చిన్నారులు, యువకులు నిత్యం ఆటలాడుతున్నారు. కాగ కొందరు వ్యాపార ధోరణితో క్రీడాకారులను సొమ్ము చేసుకునేందుకు ప్రైవేట్‌గా క్రీడా మైదానాలు ఏర్పాటు చేశారు. అందులో గంటకు రూ.600 చొప్పున వసూళ్లు చేస్తున్నారు. డబ్బులు ఉన్నవారు అందులో ఆటలాడుతున్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన చిన్నారులు, యువకులు ఆటలకు దూరం అవుతున్నారు. మండలంలో 14 గ్రామాల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. కొన్ని చోట్ల అనువైన స్థలాలు ఉండగా, మరి కొన్ని చోట్ల కేవలం సూచిక బోర్డులకే పరిమితమయ్యాయి.

త్వరగా ఏర్పాటు చేయాలి



క్రీడలకు సరైన స్థలం లేక గల్లీల్లో, వెంచర్లలో ఆటలు ఆడుతున్నాం. గత ప్రభుత్వం మినీ స్టేడియం ఏర్పాటు చేస్తామన్నారు కాని చేయలేదు. ఈ ప్రభుత్వం స్పందించి త్వరగా మినీ స్టేడియం ఏర్పాటు చేయాలి.

– శ్రీరాంరెడ్డి, యువ క్రీడాకారుడు, తూప్రాన్

అనుమతులు రాలేదు..



తూప్రాన్‌లో మినీ స్టేడియానికి ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం. జిల్లాలో ఇప్పటి వరకు నర్సాపూర్, చేగుంట, రామాయంపేటలో మైదానాల కోసం స్థలాన్ని పరిశీలించాం. ప్రభుత్వం నుంచి ఆమోదం వచ్చాయి. కానీ నిధులు మంజూరు కాలేదు.

– దామోదర్‌రెడ్డి, జిల్లా యువజన క్రీడల అధికారి

భగీరథ నీటి సరఫరాకు చర్యలు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలో తాగునీటితో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న విషయమై సాక్షి దినపత్రికలో శనివారం పాఠశాలలో తాగునీటి ఎద్దడి అనే కథనం ప్రచురితమైంది. దీంతో సంబంధిత ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ సంపత్ కుమార్, డీఈ శ్రీనివాస్, ఏఈ పుష్పరాజ్‌సింగ్ షెకావత్ స్పందించారు. శనివారం శివ్వంపేట ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులు తాగునీటి కోసం పడుతున్న ఇబ్బందులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాల సమీపంలో ఉన్న రక్షితవాటర్ ట్యాంకు నుంచి మిషన్ భగీరథనీరు అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. పాఠశాల ఆవరణలో ఉన్న సంపులోకి భగీరథ నీరు చేరాలా ఏర్పాట్లు చేస్తామన్నారు. సంపులో మోటార్ బిగించి నల్లాలు ఏర్పాటు చేసేందుకు పాఠశాల నిధులు ఉపయోగిస్తామని హెచ్‌ఎం బాలచంద్రం చెప్పారు. పాఠశాలలో తాగునీటి సమస్యకు పరిష్కారానికి చొరవ చూపిన సాక్షి దినపత్రికకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

సాక్షి ఎఫెక్ట్



పాఠశాల ఆవరణలో ఉన్న సంపుని పరిశీలిస్తున్న ఈఈ, డీఈ

బీజేపీ విజయోత్సవ సంబరాలు

జిల్లా వ్యాప్తంగా బీజేపీ నాయకులు సంబరాలు చేసుకొన్నారు. ఢిల్లీ ఎన్నికల్లో బీజేపీ గెలుపొందడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు శనివారం టపాసులు కాల్చి, స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకొన్నారు. ఇది చారిత్రాత్మక విజయమని పలువురు బీజేపీ నాయకులు అన్నారు.



నర్సాపూర్‌లో సంబరాల్లో భాగంగా టపాకాయలు కాలుస్తున్న బీజేపీ నాయకులు



రామాయంపేటలో బీజేపీ కార్యకర్తల విజయోత్సవం



చిన్నశంకరంపేటలో..



తూప్రాన్‌లో..



చిలప్‌చెడ్‌లో ..

విద్యార్థులు చదువుపై దృష్టి సారించండి

పెద్దశంకరంపేట(మెదక్): విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలని ఎస్‌ఐ శంకర్ అన్నారు. శనివారం ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి ఆదేశాలతో జిల్లా పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో పేటలోని సంస్కార్ విద్యాలయంలో మేలుకొలుపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ... విద్యార్థులు వారి వ్యక్తిగత విషయాలను సోషల్ మీడియాలో పెట్టొద్దని, సైబర్ నేరగాల నుంచి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. స్మార్ట్‌ఫోన్‌లను జాగ్రత్తగా వాడాలని సూచించారు. పోలీసులు సమాజాన్ని రక్షించడమే కాదు, సమ సమాజ మార్గదర్శకులు అని, విద్యార్థులకు మంచి స్నేహితులని వివరించారు. ఈ కార్యక్రమంలో మేలుకొలుపు కళాబృందం కోఆర్డినేటర్ ఏఎస్‌ఐ సురేందర్, కానిస్టేబుల్ రాములు, కరస్పాండెంట్ సీతారాం, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌ఐ శంకర్

వలంటీర్లు బాధ్యతాయుతంగా ఉండాలి

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దామోదర్

నర్సాపూర్ రూరల్: ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు బాధ్యతాయుతంగా ఉండి, సమాజ సేవకు కృషి చేయాలని నర్సాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దామోదర్ ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లకు సూచించారు. శనివారం ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ 1, 2 వాలంటీర్లకు ఎస్. శ్రీనివాస్, బి.స్నేహ విరాళంగా ఇచ్చిన డబ్బులతో టీ షర్ట్ లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు గంజాయి, డ్రగ్స్, మద్యపానం, ధూమపానం వంటి వాటిపై యువతకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ సురేశ్, శ్రీనివాస్, సమీరా, నజరీన్, అనిత, ఆరిఫ్, రుక్మిణి, తదితరులు పాల్గొన్నారు.



విరాళం డబ్బులతో పంపిణీ చేసిన టీ షర్టులతో వలంటీర్లు

ఆకతాయిల ఆగడాలు

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని కొంతన్‌పల్లికి చెందిన పలువురు ఆకతాయిలు విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు. కొంతన్‌పల్లిలోని ఉన్నత పాఠశాల సమీపంలోని పోతులబోగూడ, దంతన్‌పల్లి, గుండ్లపల్లి గ్రామాల నుంచి విద్యార్థులు వెళ్తున్నారు. శుక్రవారం పాఠశాల ముగిసిన అనంతరం కొంతన్‌పల్లి నుంచి పోతులబోగూడ గ్రామానికి విద్యార్థులతో వెళ్తున్న ఓ బస్‌కు పలువురు ఆకతాయిలు బైక్‌లు అడ్డంపెట్టారు. వారం రోజుల క్రితం దంతన్‌పల్లికి నడుచుకుంటూ వెళ్తున్న విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించారు. ఈ విషయం విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియడంతో శనివారం వారు ఈ విషయం పోలీసులకు తెలిపారు. దీంతో పోలీసులు వారి వివరాలు సేకరిస్తున్నారు.



విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ

మనోహరాబాద్(తూప్రాన్): ఉపాధ్యాయులతో విద్యార్థులు

మనోహరాబాద్(తూప్రాన్): మనోహరాబాద్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు బోధించారు. శనివారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో స్వయం పాలన దినోత్సవాన్ని విద్యార్థులు నిర్వహించారు. డీఈఓగా వేణు, ఎంఈఓగా వైష్ణవి, హెచ్‌ఎంగా రుషిక వ్యవహరించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులను అందజేసినట్లు ఇన్‌చార్జి హెచ్‌ఎం కృపాకర్‌రెడ్డి తెలిపారు.

హవేళిఘణాపూర్‌లో..

హవేళిఘణాపూర్(మెదక్): మండల కేంద్రం హవేళి ఘణాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు స్వయంపాలన దినోత్సవాన్ని శనివారం ఘనంగా జరుపుకొన్నారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా ఒకరోజు విధులు నిర్వర్తించారు. డీఈఓగా జశ్వంత్, ఎంఈఓగా యశ్వంత్‌తో పాటు సుమారు వందమంది ఉపాధ్యాయులుగా పాఠాలు బోధించారు. పాఠశాల హెచ్‌ఎం కరుణాకర్ మాట్లాడుతూ భవిష్యత్ లో ఏ రంగంలో ఉన్న కలిసి సాగాలన్నారు. కార్యక్రమంలో ఏఎంఓ సుదర్శనమూర్తి, హెచ్‌ఎం కరుణాకర్ ఉపాధ్యాయులు రాజశేఖర్, శ్యామల, దేవ్లా, రాజేశం, రవీందర్, మహేశ్వరచారి, మధుసూధన్, అశోక్, బస్వరాజ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



హవేళిఘణాపూర్ పాఠశాలలో..

శిల్పాలకొండ.. వెల్పుగొండ..

- ఎక్కడ చూసినా దేవతా విగ్రహాలు
- నేటి నుంచి తుంబురీశ్వరస్వామి ఉత్సవాలు

టేక్మాల్(మెదక్): అద్భుతమైన శిలా సంపద.. విగ్రహాలు, శివలింగాలతో గుట్టపై ఉంది రామాలయం . గ్రామ దేవతలను కొలిచే ఆచారం కల్గిన అతిప్రాచీనమైన గ్రామం. మెదక్ జిల్లా టేక్మాల్ మండలంలోని వెల్పుగొండలోని దేవాలయం ఉత్సవాలకు ముస్తాబు అయింది.

స్వయంభూ తుంబురీశ్వరుడు..

వేల్పుగొండలోని శిల్పకళకు శిఖరం స్వయంభూ శివలింగ ఆలయం. ఇక్కడి శివున్ని నాదర తుబురీశ్వరునిగా చెబుతున్నారు. కాకతీయుల కాలంలో ఈ ఆలయాన్ని నిర్మించారు. ప్రతీ ద్వారంపై చుట్టూ శిల్పాలు చూపరులను ఆకర్షిస్తాయి.

నేటి నుంచి ఉత్సవాలు..

తుంబురీశ్వరాలయ ఉత్సవాలు ఈనెల 09 నుంచి 12 వరకు నిర్వహించనున్నట్లు సర్పంచ్ బోయిని నారాయణ తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా 9న గణపతిపూజ, అఖండదీపారాదన, పుణ్యవచనం, కలశస్థాపనం, రుద్రాభిషేకం, హనుమదభిషేకం, సాయంత్రం బండ్ల ఊరేగింపు, ఉత్తర పూజ, భజనలు, 10న రుద్రాభిషేకం, పుష్పార్చన, పాచిబండ్లు, ఉత్తర పూజ భజనలు, 11న రుద్రాభిషేకం, బిల్వార్చన ఆకుల పూజ, పాదుకాపూజ, కుస్తీ పోటీలు, పల్లకీసేవ, భజనలు, రాత్రి రథోత్సవం, 12న కల్యాణోత్సవం, అన్నపూజ, అకుపూజ వంటి పూజలు నిర్వహించనున్నారు. అన్ని రకాల ఏర్పాట్లను పూర్తి చేశామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.



వెల్పుగొండలోని తుంబురీశ్వరాలయం



గర్భగుడిలోని తుంబురీశ్వరుడు

సంక్షిప్త వార్తలు

◆ అంజన్న సన్నిధిలో భక్తుల పూజలు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలో కొలువైన చాకరిమెట్ల సహకార ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం భక్తజన సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సత్యనారాయణ వ్రతాలు ఆచరించారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్, చైర్మన్ ఆంజనేయశర్మ, ఈఓ శ్రీనివాస్, ప్రధాన అర్చకులు దేవాదత్తశర్మ, ప్రభుశర్మ, దేవిశ్రీశర్మ, శ్రీవాత్సవ్‌శర్మ ఉన్నారు.

◆ విద్యార్థులకు ఎగ్జామ్ కిట్స్ పంపిణీ

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని ధరిపల్లి జెడ్పీపాఠశాల పదో తరగతి విద్యార్థులకు హర్ట్ టూ హెల్ప్ సంస్థ ఆధ్వర్యంలో ఎగ్జామ్ కిట్స్‌ను అందించారు. పాఠశాలలోని 36 మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్, పెన్నులు, కంపాక్స్‌బాక్స్‌లను అందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్ రావు, దాత ఏఈ స్వప్న, ఉపాధ్యాయులు రమేశ్‌చౌదరి, నరేష్, జ్యోతి పాల్గొన్నారు.

◆ విగ్రహ ప్రతిష్ఠోత్సవాలకు ముస్తాబు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెంకట్రావ్‌పేటలో గ్రామ గౌడసంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన రేణుకా ఎల్లమ్మ ఆలయం విగ్రహ ప్రతిష్ఠోత్సవాలకు ముస్తాబైంది. ఇందులో భాగంగా 9న స్థాపిత దేవతాపూజలు, మహాచండి హోమం, 10న మూలమంత్ర హవనం, ఎల్లమ్మ యంత్ర, విగ్రహ ప్రతిష్ఠ, అనంతరం ఎల్లమ్మ కల్యాణం, అన్నదానం , 11న సామూహిక బోనాల ఊరేగింపు నిర్వహించనున్నట్లు తెలిపారు. రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామి ఆధ్వర్యంలో అర్చకులు ఉమాశంకరశర్మ బృందం పూజలు చేస్తున్నట్లు గౌడసంఘం సభ్యులు వివరించారు.

కౌడిపల్లిలో..

మండలం కేంద్రం కౌడిపల్లిలో మల్లన్న జాతర ఈనెల 9 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు గ్రామ గోకుల్ యాదవ సంఘం సభ్యులు తెలిపారు. ఇందులో భాగంగా 9న గంగపటం, 10న దేవునిలగ్గం, అగ్నిగుండాలు, బోనాలు, 11న నాగవెల్లి, బోనాలు, అన్నదానం, 12న ఎల్లమ్మ కల్యాణం, బోనాల ఊరేగింపు ఉంటాయని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

◆ విద్యుత్ సరఫరాకు అంతరాయం

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని 132 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మండలంలోని సబ్‌స్టేషన్‌లకు విద్యుత్ సరఫరాలో అంతరాయం జరగనుందని ఏడీఈ మోహన్‌బాబు, ఏఈ దినకర్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మండలంలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

◆ ప్రతీ విద్యార్థి ఇష్టంతో చదవాలి



మనోహరాబాద్(తూప్రాన్): ప్రతి విద్యార్థి ఇష్టంతో చదవినప్పుడే మంచి భవిష్యత్‌కు బాటలు వేసుకుంటారని రిటైర్డ్ డైట్ కాలేజ్ ప్రిన్సిపాల్, సైకాలజిస్ట్ రమేశ్‌బాబు అన్నారు. శనివారం మండలంలోని కాళ్లకల్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలు, పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలో తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నర్సింగం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని శాలిపేటలో కాంగ్రెస్ నాయకులు గ్రామానికి చెందిన శ్రీలతకు రూ.60 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందించారు. చెక్కు మంజూరుకు సహకరించిన ఎమ్మెల్యే రోహిత్‌కు కాంగ్రెస్ నాయకులు అంజాగౌడ్, అంబాదాస్, దత్తు, ఆంజనేయులు, రఘుపతి కృతజ్ఞతలు తెలిపారు.

◆ నేడు దనూరలో ఆలయ వార్షికోత్సవం

టేక్మాల్(మెదక్): మండలంలోని దనూరలోని కాశీ అన్నపూర్ణ విశ్వేశ్వరాలయ వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహించనున్నట్లు జోగిపేట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సత్యనారాయణ శనివారం తెలిపారు. ఉత్సవంలో భాగంగా ఆలయంలో గోపూజ, రుద్రాభిషేకం, ద్వాదశ జ్యోతిర్లింగ పూజలను ఆలయ అర్చకులు ఆంజనేయ స్వామి నిర్వహిస్తారన్నారు. భక్తులు అధిక సంఖ్యలో రావాలన్నారు.